క్లుప్తంగా

నియోజకవర్గంలో ఆటస్థలాలు కరువు

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఏ రంగంలో అయినా ఓటమి రేపటి గెలుపునకు నాంది అని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం గ్రామంలో తుమ్మటి యాదగిరి (గవాస్కర్) మెమోరియల్ ట్రోఫీని పోచారం ప్రీమియర్ లీగ్(పీపీఎల్) పేరుతో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం జెడ్పీటీసీ మహిపాల్‌తో కలిసి మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు .ఆటలు యువతను ఏకతాటిమీదకు తీసుకురావడానికి ఉపయోగపడతాయన్నారు. నియోజకవర్గంలో ఆట స్థలాలు కరువయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీశైలం, వార్డు సభ్యులు చిన్న, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాస్, ఆదిబట్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు జహంగీర్‌ఖాన్ పాల్గొన్నారు .

ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు: ఎంపీపీ



మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుకన్య

యాచారం: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య ప్రజలకు సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం అనిరెడ్డి రామరక్ష ఆస్పత్రి వైద్య బృందం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించింది. ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో దాదాపు 250 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీటీసీ గోపాల్

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్-మద్దెలకుంట తండా బీటీ రోడ్డు నిర్మాణ పనులు మూడు రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. ఆదివారం రోడ్డు నిర్మాణ పనులను స్థానిక ఎంపీటీసీ గోపాల్.. నాయకులతో కలిసి పరిశీలించారు. ఎంపీటీసీ మాట్లాడుతూ.. రావిచేడ్-మద్దెలకుంటతండా రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కృషితో ప్రభుత్వం రూ.2.20 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకటేష్, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు బాలకృష్ణ, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేష్ యాదవ్, వార్డు సభ్యులు పవన్‌కుమార్, యాదయ్య, మోనాజీ తదితరులున్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేశారు: సీఐటీయూ



సర్వే నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

తుర్కయంజాల్: బీఆర్‌ఎస్ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్ ఆరోపించారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పురపాలక సంఘం పరిధి మన్నెగూడలోని ఎస్‌ఎస్‌ఆర్‌నగర్‌లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. తమ సర్వేలో అనేకమంది సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తేలిందని, అదే విధంగా అర్హత ఉండి కూడా నేటికీ పింఛన్లు అందక అనేక మంది ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, ఆశీర్వాదం, సత్యనారాయణ, శంకరయ్య, ప్రకాష్ కారత్, శ్రీధర్ పాల్గొన్నారు.

'సీఎం సభకు తరలిరండి'

అబ్దుల్లాపూర్‌మెట్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం మహేశ్వరం మండలం తుమ్మలూరులో నిర్వహించనున్న హరితహారం కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరవుతున్నారని.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అనుబంధ కమిటీలు తుమ్మలూరుకు తరలిరావాలని మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు తరలివెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

నిరుపయోగంగా బీసీ హాస్టల్

- విద్యార్థులు లేరన్న సాకుతో ఎత్తివేత
- శిథిలావస్థకు చేరిన భవనం
- బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్



శిథిలావస్థలో ఆమనగల్లు బీసీ హాస్టల్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని పోలీసు స్టేషన్ వెనుక మాడ్గుల రోడ్డులో ఉన్న బీసీ హాస్టల్ భవనం నిరుపయోగంగా మారింది. కోట్లాది రూపాయల విలువ చేసే స్థలం అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీసీ హాస్టల్ భవనం స్థానంలో నూతనంగా బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆమనగల్లు మండలంలో ఉన్న ఒక్క బీసీ హాస్టల్ ఎత్తివేయడంతో బీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థులు లేరని...

నాలుగు మండలాలకు కూడలిగా ఉండి ఎన్నో దశాబ్దాల పాటు బీసీ విద్యార్థులకు విద్యా వసతి కల్పించిన ఆమనగల్లు బీసీ హాస్టల్‌ను విద్యార్థులు లేరన్న సాకుతో ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఎత్తివేసింది. హాస్టల్‌ను ఎత్తివేసినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. దాదాపు 4 దశాబ్దాల క్రితం నిర్మించిన బీసీ హాస్టల్‌లో ప్రతి ఏడాది 200 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉంటూ వివిధ పాఠశాలల్లో చదువుకునేవారు.. కాగా సరైన నిర్వహణ లేకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరడం విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గడంతో బీసీ హాస్టల్‌ను ఎత్తివేసి స్థానికంగా ఉన్న ఎస్సీ హాస్టల్‌లో విలీనం చేశారు.

వృథాగా భవనం..

ఆమనగల్లు పట్టణంలోని బీసీ హాస్టల్‌ను 2018లో ఎత్తివేయడంతో అప్పటి నుంచి భవనం వృథాగా మారింది. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో కోట్ల రూపాయలు విలువ చేసే వసతిగృహ భవనం వృథాగా మారింది. అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా బీసీ హాస్టల్ భవనం స్థలంలో మార్కెట్ నిర్మించాలని బీజేపీ నాయకులు కోరుతుండగా ఈ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి యువతకు ఉపాధి కల్పిస్తామని బీఆర్‌ఎస్ నాయకులు అంటున్నారు. ఇదే స్థలంలో గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి



వేలాదిమంది విద్యార్థులకు విద్యనందించిన బీసీ వసతి గృహాన్ని విద్యార్థులు లేరని ఎత్తివేయడం విచారకరం. వసతిగృహం లేకపోవడంతో బీసీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో హాస్టల్ భవనంలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి.

- ఫరీద్, మండల ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు, ఆమనగల్లు

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి



బీసీ హాస్టల్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో నిరుపయోగంగా మారింది. హాస్టల్ స్థానంలో బీసీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి. దీంతో స్థానిక విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది.

- భరత్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఆమనగల్లు

ఘనంగా నీళ్ల పండగ



ఇబ్రహీంపట్నం: వేడుకల్లో ఉప్పరిగూడవాసులు



కడ్తాల్: ప్రతిజ్ఞ చేస్తున్న గిరిజనులు

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నీళ్ల దినోత్సవాన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి అలంకరించారు. వాటర్ ట్యాంక్‌లకు తోరణాలు కట్టారు. ఉప్పరిగూడలో జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి, ఎల్మినేడులో అశోకవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు .

కడ్తాల్ మండలంలో..

కడ్తాల్: రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని గ్రామాల్లో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీళ్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గానుగుమార్ల తండా పంచాయతీ పరిధిలోని కానుగుబావితండాలో నిర్వహించిన మంచినీళ్ల పండుగ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఏఈ శ్రావ్య తదితరులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ హంశ, ఉప సర్పంచ్ శారధ, కార్యదర్శి ప్రసాద్ నాయకులు లక్పతినాయక్, సేవ్యా, టిక్‌లాల్, రమేశ్ పాల్గొన్నారు.

భగీరథతో స్వచ్ఛమైన తాగునీరు..

యాచారం: మిషన్ భగీరథ నీటితో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో ఆదివారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సుచరిత, గ్రామ సర్పంచ్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం..

తలకొండపల్లి: సీఎం కేసీఆర్ మహిళల తాగునీటి కష్టాలు గుర్తెరిగి అధికారంలోకి వచ్చిన తక్షణమే మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రజల తాగునీటి కష్టాలను శాశ్వతంగా దూరం చేశారని సర్పంచ్ ధరణి శివశంర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సావాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని మెదక్‌పల్లిలో జలదినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. సర్పంచ్ ధరణి, శివశంకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామానికి చెందిన అరుణమ్మ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఆ గ్రామ సర్పంచ్ భారతమ్మ ఆదివారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా ఎంపీటీసీ గోపాల్ బాధిత కుటుంబానికి రూ.3వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్ధన్‌గౌడ్, నాయకులు రమేశ్‌గౌడ్, రమేశ్‌యాదవ్, యాదగిరి, పాండు, యాదయ్య, శ్రీశైలం, రవి, కృష్ణయ్య, రమేశ్, నర్సింహ తదితరులు ఉన్నారు.

ఉప్పల ట్రస్ట్ చేయూత..

కడ్తాల్: కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని మద్దెలకుంట తండాకు చెందిన హన్మీ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ ట్రస్ట్ ద్వార ఆదివారం బాధితురాలికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందించారు. ట్రస్ట్ సభ్యులు శేఖర్, సాయికుమార్, తిరుపతినాయక్ ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి..

యాచారం: చిన్ననాటి మిత్రుడు మృతి చెందడంతో అతని కుటుంబానికి అండగా నిలిచారు ఆ స్నేహితులు. వివరాలు... యాచారం గ్రామానికి చెందిన గడల లింగం నెలరోజుల కింద గునుగల్ అటవీ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. లింగం పదో తరగతి(2002-03) బ్యాచ్‌కు చెందిన స్నేహితులు రూ.లక్ష సేకరించి లింగం కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. భవిష్యత్తులో లింగం కుటుంబ సభ్యులకు ఏ కష్టం వచ్చిన అండగా ఉండి ఆదుకుంటామని వారు పేర్కొన్నారు. సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

శ్రీను కుటుంబానికి..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన శ్రీను (54) అనారోగ్యానికి గురై ఆదివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, జెడ్పీటీసీ ఉప్పల వెంటకటేశ్, ఉప సర్పంచ్ అజీజ్, ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, మెకానిక్ సుధాకర్, రాజు, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారంతా కలిసి రూ.15,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, శ్రీరాము, రవి, ఆంజనేయులు, బాలయ్య, పరంధాములు పాల్గొన్నారు.

మంచాల-జాపాల రోడ్డును బాగుచేయండి



వినతిపత్రం ఇస్తున్న బాలరాజ్ తదితరులు

మంచాల: మంచాల-జాపాల రోడ్డును బాగుచేయాలని మంచాల గ్రామ కోఆప్షన్ సభ్యుడు ఆశ్వల బాలరాజ్ ఆదివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నుంచి శ్మశానవాటిక వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించిన్నట్లు బాలరాజ్ తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు: ఎమ్మెల్యే



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: సీసీ కెమెరాలతో నేరాలను అదుపులో ఉంటాయని, నియోజకవర్గంలో ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీఫేజ్ 1లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలనుప్రారంభిచడంతో పాటు కాలనీ భవనం మొదటి అంతస్తు నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. సీసీ ఏర్పాటుతో నేరం జరిగిన గంటల వ్యవధిలోనేరస్తులను పట్టుకోవచ్చని అన్నారు.అన్ని కాలనీల్లో వంద శాతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,కాలనీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, నాయకులు రమేష్, రాంబాబు రులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వి ప్రజావ్యతిరేక విధానాలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అశోక్‌గౌడ్



ఇబ్రహీంపట్నం రూరల్: అశోక్‌గౌడ్‌ను సన్మానించిన నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త అశోక్‌గౌడ్ పేర్కొన్నారు . ప్రధాన మంత్రి మన్‌కీబాత్ 102వ ఎపిసోడ్‌ను ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వైష్ణవి గార్డెన్‌లో వీక్షించారు. అనంతరం రెండోసారి నూతనంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన కొత్త అశోక్‌గౌడ్‌ను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి, కౌన్సిలర్ భాస్కర్, నియోజకవర్గ మాజీ కన్వీనర్ సత్యనారయణ, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం..

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులు ఆరుగాలం పండించిన ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఉప్పరిగూడలో ఆయన మాట్లాడుతూ.. వరి పంటలు కోసి కల్లాల్లో ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లినా ధాన్యం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గోనే బస్తాలు ఇవ్వకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లర్లు ధాన్యం తీసుకుపోవడం లేదన్నారు. తరుగు పేరుతో రైతులను మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎక్కడ పడితే అక్కడే ధాన్యం నిల్వలు ఉన్నాయన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద చెక్కులు మంజూరయ్యాయి. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో ఆదివారం లబ్ధిదారులకు ఎమ్మెల్సీ కసిరెడ్డి ఆయా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగన్, సురేందర్‌రెడ్డి, రాజశేఖర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు. అంతకుముందు వెల్దండ మండలం చెర్కూర్ గ్రామంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-82 కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషిచేసిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని రాజశేఖర్ ఆధ్వర్యంలో పలువురు రైతులు ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగవు

డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య

తుర్కయంజాల్: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోం అని డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఆదివారం ఆయన తుర్కయంజాల్‌లో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధిలో కౌన్సిల్ పాత్ర ఎంత కీలకమైందో అంతే స్థాయిలో ఎమ్మెల్యే పాత్ర కూడా ఉంటుందని ఆ విషయం మరిచిపోయి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మున్సిపాలిటీల తాగునీటి అవసరాల కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు కేటాయిస్తే ఒక్క తుర్కయంజాల్‌కే రూ.92 కోట్లు కేటాయించిందన్నారు. అవినీతిపై చర్చించే దమ్ము, ధైర్యం ఉంటే కాంగ్రెస్ నాయకులు సోమవారం తుర్కయంజాల్ చౌరస్తాలో చర్చకు రావాలని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రమావత్ కళ్యాణ్ నాయక్ సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కీర్తన, స్వాతి, జ్యోతి, సంగీత, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యంరెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి

సంఘం మండల అధ్యక్షుడు విజయ్‌కృష్ణ



విజయ్‌కృష్ణను సన్మానించిన సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా ఆమనగల్లు మున్సిపల్ కౌన్సిలర్ తల్లోజు విజయ్‌కృష్ణ ఎన్నికయ్యారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన మండల విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశంలో సంఘం నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా తల్లోజు జంగయ్య, సహాయ ఎన్నికల అధికారిగా నయనాచారి వ్యవహరించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో 48 మంది ఓటు హక్కు వినియోగించుకోగా తల్లోజు విజయ్‌కృష్ణకు 36 ఓట్లు, గన్నోజు వెంకటాచారికి 11 ఓట్లు వచ్చాయి. దీంతో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా తల్లోజు విజయ్‌కృష్ణ మరోమారు ఎన్నికైనట్లు ప్రకటించారు. విజయ్‌కృష్ణ గత ఆరేళ్లుగా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా విజయ్‌కృష్ణ మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తామని, తనను మూడవసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, వెంకటాచారి, మాధవాచారి, రామాంజనేయులు, పుల్లయ్యాచారి, చంద్రాచారి, బ్రహ్మం, ఆంజనేయులు, తల్లోజు రామకృష్ణ, యాదగిరి, వేణు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

యాచారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొగుళ్లవంపు గ్రామానికి చెందిన న్యాయవాది గౌరారం నర్సిరెడ్డి ఆదివారం మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో నగరంలోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంగ్రెస్ శ్రేణులను పెడుతున్న ఇబ్బందుల పట్ల లీగల్ సెల్ న్యాయవాదులు అండగా ఉండాలని అన్నారు. న్యాయవాదులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గౌరవం దక్కడంలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్ల స్థలాలు, భద్రత కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, న్యాయవాదులు వెంకటేశ్, నర్సింగ్ యాదవ్, బొమ్మ రాజు, రాచిరెడ్డి, సురేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై పీడీ యాక్టు

సీఐ మన్మోహన్



అబ్దుల్లాపూర్‌మెట్: గోవులను, పశువులను ఎవరైనా అక్రమ రవాణా చేయడంగానీ, గోవధకు తరలించినాగాని వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి, వాహనాలు సీజ్ చేస్తామని అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ హెచ్చరించారు. పది రోజులుగా మండల పరిధిలోని నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల సరిహద్దు కొత్తగూడెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిని పట్టుకోవడంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం మాట్లాడుతూ.. పశువులను అక్రమంగా తరలించే వారిని గుర్తించి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. పశువుల రవాణాపై సీఐ చేసిన సూచనలు..

- ఎవరైనా పశువులు రవాణా చేసినట్లైతే సంబంధిత పశు వైద్యాధికారితో అనుమతి తీసుకొని ఆనిమల్ యాక్ట్ ప్రకారం రవాణా చెయ్యాలి.
- పశువులు రవాణా చేసే సమయంలో ఏ రైతు వద్ద, ఎక్కడ కొనుగోలు చేస్తే అక్కడ సంబంధిత గ్రామ పంచాయతీ అనుమతి రశీదులు తప్పనిసరిగా చూపించాలి.
- కేవలం ఆవులు మాత్రమే కాదు, ఎద్దులను కూడా ఆనిమల్ యాక్ట్ ప్రకారం నియమ నిబంధనలకు లోబడే రవాణా చేయాలి.
- పశువులు రవాణా చేసే సమయంలో వాటిని ఇరుకుగా, హింసాత్మకంగా, గాలి-వెలుతురు తగలకుండా రవాణా చేసినట్లైతే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం.
- పశువులు, ఆవులు, ఎద్దులను ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిస్తే అట్టి సమాచారాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసు స్టేషన్ ఫోన్ నంబర్ 87126 62650, పెట్రోల్ మొబైల్ ఫోన్ నంబర్స్: 8712662651/652 కు సమాచారం అందించండి. అలా కాకుండా పశువులు, ఆవులు, ఎద్దులు అక్రమ రవాణా చేసినపుడు వారిని అడ్డుకొని, వారితో అనవసరంగా గొడవలు సృష్టిస్తే అలాంటి వారిపైనా చట్ట ప్రకారం చర్య తీసుకుంటాం. చట్టాన్ని ఎవరు చేతుల్లో తీసుకున్నా చర్యలు తప్పవు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో గురుకుల విద్యార్థినుల సత్తా

ఒకే కళాశాల నుంచి అర్హత సాధించిన ఐదుగురు



త్రిష, 1064వ ర్యాంకు



రచన, 1690వ ర్యాంకు



ఆశ్రిత, 2161వ ర్యాంకు



మల్లిక, 4914వ ర్యాంకు



స్పందన, 5049వ ర్యాంకు

ఇబ్రహీంపట్నం రూరల్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నల్లకంచెలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. హైదరాబాద్ రీజియన్‌లోనే ఐదురుగు విద్యార్థులు ఒకే కళాశాల నుంచి అర్హత సాధించి రికార్డు నెలకొల్పారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని నల్లకంచె సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరం పూర్తిచేసిన ఐదుగురు విద్యార్థులు.. కె.త్రిష (ఎస్టీ) 1064 ర్యాంకు, జె.రచన (ఎస్సీ) 1690వ ర్యాంకు, ఈ.మల్లిక (ఎస్సీ) 4914 ర్యాంకు, ఈ.ఆశ్రిత(ఎస్సీ) 2161 ర్యాంకు, స్పందన (ఎస్సీ) 5049 ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్స్‌పాల్ లీలావతి ఆదివారం అభినందించారు. ఆర్‌సీఓ నాగ కల్యాణి సహకారంతో ఇంతటి పేరు తీసుకురావడానికి సహకరించిన ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు.